క్లుప్తంగా

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



గుంటూరు రూరల్: జీవాత్మ, ఆత్మ, పరమాత్మ అనే మూడు ఆత్మల వివరం తెలుసుకోవటం వల్ల మధ్యాత్మ ఆరాధనతో ధర్మాల స్థాపన జరుగుతుందని త్రైత సిద్ధాంత ప్రబోధ సమితి హిందూ జ్ఞానవేదిక గుంటూరు కమిటీ అధ్యక్షుడు రౌతు శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆదివారం వట్టిచెరుకూరు మండలంలోని కాట్రపాడు, చముళ్ళమూడి గ్రామాల్లో త్రైత సిద్ధాంతం-ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంతం భగవద్గీత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా త్రిమత ఏకైక గురువు, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు గ్రహీత ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన ఆధ్యాత్మిక త్రైత సిద్ధాంత గ్రంథాలను ప్రచారం చేశారు. కృష్ణారావు, రొంపిచర్ల రామకృష్ణ, శివలింగంనాయక్, హరిబాబు, పట్టాభిశ్రీను, సుబ్బారావు, ప్రకాష్, అన్నపూర్ణ, ప్యారమ్మ, షైనీ, విద్య తదితరులు పాల్గొన్నారు.

1న కవి సమ్మేళనం

నగరంపాలెం: ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం, గుంటూరు జిల్లా రచయితల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో మే ఒకటో తేదీన సోమేపల్లి వెంకటసుబ్బయ్య జయంతి, కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు జిల్లా రచయితల సంఘం కార్యదర్శి ఎస్ఎం సుభాని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బృందావన్‌గార్డెన్స్ అన్నమయ్య గ్రంథాలయ ఆవరణలో సమ్మేళనం నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ఉపాధ్యక్షులు వెలువోలు నాగరాజ్యలక్ష్మి, ప్రముఖ సాహితీవేత్త తోటకూర వెంకటనారాయణ, ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు పొన్నూరు వెంకట శ్రీనివాసులు, శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం అధ్యక్షుడు మస్తానయ్య హాజరవుతారని పేర్కొన్నారు.

అలరించిన శాస్త్రీయ సంగీత కచేరి



నగరంపాలెం: స్థానిక లక్ష్మీపురం శ్రీ త్యాగరాజస్వామి కళావేదికపై ఆదివారం రాత్రి శ్రీ త్యాగరాజ సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలో నెల వారి కార్యక్రమంలో భాగంగా యువ కళాకారులతో శాస్త్రీయ సంగీత కచేరి నిర్వహించారు. కుమారి మల్లాది సింధురాగేశ్వరి శ్రీత్యాగరాజస్వామి కీర్తనలు, వాగ్గేయకార కీర్తనలను శ్రావ్యంగా అలరించారు. వయోలిన్‌పై కె.కామాక్షి(విజయవాడ), మృదంగంపై మల్లాది శివానంద యశస్వి వాయిద్య సహకారాన్ని అందించారు. అనంతరం కళాకారులను సంస్థ కార్యదర్శి వల్లూరి కృష్ణకిషోర్, ఉపాధ్యక్షులు ఎస్.గిరిజాశంకర్, కోశాధికారి రవీంద్రనాథ్ సత్కరించారు.

ప్రతిభావంతులైన విద్యార్థినులకు అభినందన

గుంటూరు ఎడ్యుకేషన్: ఇటీవల విడుదలైన టెన్త్, ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థినులకు కన్న మిత్ర మండలి ఆధ్వర్యంలో ఆదివారం ఎన్టీఆర్ స్టేడియం వద్ద సన్మానించారు. నగరానికి చెందిన అరసపల్లి వెంకట కోటేశ్వరరావు తనయ మోహనశ్రీ టెన్త్‌లో 589 మార్కులతో పాటు సయ్యద్ అహ్మద్ తనయ ఆఫ్రిన్ టెన్త్‌లో 583 మార్కులు సాధించినట్లు కన్నా మిత్ర మండలి అధ్యక్షుడు జి.కన్న తెలిపారు. అదే విధంగా అరసపల్లి రాధాదేవి సీనియర్ ఇంటర్‌లో 981 మార్కులు సాధించినట్లు చెప్పారు. ఈసందర్భంగా కన్నా మాట్లాడుతూ సాధారణ కుటుంబాలకు చెందిన విద్యార్థులు టెన్త్; ఇంటర్‌లలో అత్యుత్తమ ఫలితాలు సాధించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మిత్ర మండలి సభ్యులు సాంబశివరావు, గుంటక శ్రీనివాసరెడ్డి, గురువారెడ్డి, కరుణాకర్‌రెడ్డి, పొట్టి నాగేశ్వరరావు, శ్రీహరి, ఆదినారాయణ పాల్గొన్నారు.

డాక్టరేట్ అందుకున్న పూర్ణ ప్రజ్ఞాచారి



తెనాలిరూరల్: హైదరాబాద్‌లోని తెలుగు సంస్కృతి సాంస్కృతిక సేవా సంస్థ ప్రదానం చేసిన గౌరవ డాక్టరేట్‌ను సాహితీరత్న నూతక్కి పూర్ణ ప్రజ్ఞాచారి అందుకున్నారు. హైదరాబాద్ చిక్కడ్‌పల్లి త్యాగరాయ గాన సభావేదికపై ఆదివారం సంస్థ చైర్మన్ డాక్టర్ ఎంజీ శంకర్, వేదాంత పండితులు సుబ్బరాయ శర్మ, ఉస్మానియా విశ్వవిద్యాలయ తెలుగు శాఖ ఆచార్యులు డాక్టర్ కీసరి జనార్దనరావు, కమెడియన్ అప్పారావులు పూర్ణ ప్రజ్ఞాచారికి గౌరవ డాక్టరేట్‌ను అందజేశారు. ఈ మేరకు వివరాలను ప్రజ్ఞాచారి వెల్లడించారు. తన తండ్రి మధురకవి నూతక్కి అబ్రహాంకు డాక్టరేట్‌ను అంకితం చేస్తున్నట్టు తెలిపారు. స్వగ్రామం తెనాలి మండలం కొలకలూరు గ్రామ కళాకారులకు ఈ గౌరవం దక్కినట్లేనని పేర్కొన్నారు.



విశాలంగా విస్తరించిన పెదకాకాని శివాలయం రోడ్డు



ట్రాఫిక్ లేని పెదకాకాని సెంటర్ విస్తరణ



చెరువు కట్టపై నూతనంగా వేసిన వాకింగ్ ట్రాక్



పెదకాకాని బాజీబాబా దర్గాకు నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డు

సంక్షేమం, అభివృద్ధికి చెరగని చిహ్నం

- పెదకాకానిలో నలు దిశలా అభివృద్ధి పరుగులు
- రోడ్లు, డ్రెయిన్లు, చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు
- 25 ఏళ్లలో సాధ్యంకానిది, ఐదేళ్లలో సుసాధ్యం

పెదకాకాని: అభివృద్ధి, సంక్షేమం వైఎస్సార్ సీపీ ద్వారానే సాధ్యమవుతుందని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరూపించారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పొన్నూరు నియోజకవర్గంలోని పెదకాకాని గ్రామంలో అభివృద్ధి పనులు వేగవంతం చేశారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా సీసీ రోడ్లు, డ్రెయిన్లు, మౌలిక వసతులు, శ్మశానాల అభివృద్ధి, కమ్యూనిటీ భవనాల నిర్మాణం చేపట్టారు. ఒక్క పెదకాకాని గ్రామంలోనే రూ.10 కోట్లతో అభివృద్ధి పనులు చేశారు. రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి ఎంపీ నిధులతో పెదకాకాని ప్రధాన సెంటర్ నుంచి రోడ్డు విస్తరణ, నిర్మాణం, డివైడర్ సెంటర్ లైటింగ్ మంచి నీటి చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేశారు. 25 ఏళ్లుగా పొన్నూరు నియోజకవర్గంలో జరగని అభివృద్ధి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదేళ్లలో చేసి, చూపించారు. ఒక్క బాజీబాబా దర్గాకు రూ.1.97 కోట్లతో విశాలమైన సీసీ రోడ్డుతో పాటు ప్రహరీ నిర్మాణం జరిగింది. పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు పొన్నూరు నియోజకవర్గంలో సంక్షేమ పథకాల ద్వారా నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో రూ.1,600 కోట్లను ప్రభుత్వం జమ చేసింది. రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందాలంటే విద్య, వైద్యం, వ్యవసాయం రంగాలు అభివృద్ధి సాధించాలని, వాటికి అధిక ప్రాధాన్యం ఇచ్చారు సీఎం వైఎస్ జగన్.

జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రిగా వస్తున్నాడు

- ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు కిలారి, బలసాని
- లాలుపురంలో సార్వత్రిక ఎన్నికల ప్రచారం
- వైఎస్సార్ సీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం
- పెదనందిపాడు మండలంలో బలసాని ఎన్నికల ప్రచారం
- ప్రతి గ్రామంలో ఘన స్వాగతం పలికిన ప్రజలు



లాలుపురంలో ప్రచార రథంపై అభివాదం చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు రోశయ్య, బలసాని

గుంటూరు రూరల్: ప్రత్తిపాడు నియోజకవర్గంలో ఆదివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా రూరల్ మండలంలోని లాలుపురం గ్రామంలో జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ గుంటూరు ఎంపీ, ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థులు కిలారి వెంకట రోశయ్య, బలసాని కిరణ్‌కుమార్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి గత ఎన్నికల్లో జగనన్న ఇచ్చిన హామీలు, సంక్షేమ పథకాలను వివరించారు. ఎన్నికల మేనిఫెస్టోలోని జగనన్న ఇచ్చిన హామీలను వివరించారు. జగనన్న మాట ఇచ్చాడంటే చేసి తీరుతాడంతేనని స్పష్టం చేశారు. ఫ్యాను గుర్తుపై ఓటువేసి జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని కోరారు. గ్రామంలో ప్రజలంతా జగనే మా నమ్మకం, జగన్ వెంటే మేము టాం...జగనే మా ధైర్యం అంటూ మరింత ఉత్సాహంతో వైఎస్సార్ సీపీ జెండాలను పట్టుకుని అభిమానాన్ని చాటుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కార్పొరేటర్లు, పలు కార్పొరేషన్ల డైరెక్టర్‌లు, మార్కెట్ యార్డుల డైరెక్టర్‌లు, వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



ఉప్పలపాడులో ఎన్నికల ప్రచారంలో బలసాని కిరణ్ కుమార్

అన్ని వర్గాల అభివృద్ధే జగనన్న లక్ష్యం

ఉప్పలపాడు(కాకుమాను): రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల అభివృద్ధే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన అందించారని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్ కుమార్ అన్నారు. పెదనందిపాడు మండలంలోని ఉప్పలపాడు, నాగభైరవ పాలెం, జరుగువారి పాలెం, అన్నవరం గ్రామాల్లో ఆదివారం బలసాని ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్ మాట్లాడుతూ గత ఐదేళ్ల నుంచి కులాలు, మతాలు, ప్రాంతాలు, పార్టీలు చూడకుండా అర్హతే ఆధారంగా రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్ జనరంజక పాలన చేశారన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వస్తేనే అన్ని వర్గాల ప్రజలు సుఖసంతోషాలతో జీవిస్తారని పేర్కొన్నారు. కేవలం అగ్రవర్ణాలకే కూటమి కొమ్ము కాస్తున్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గమనించాలన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేయాలనే లక్ష్యంతో ఆచరణకు సాధ్యం కాని హామీలతో కూటమి ఎన్నికలకు వస్తోందన్నారు. ఈ ఎన్నికలు పేదలకు, పెత్తందారులకు మధ్య జరుగుతున్నాయని, కూటమికి బుద్ధి చెప్పాలన్నారు. గ్రామంలో బలసానికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ షేక్ ఖాసీంపీరా, మండల ఉపాధ్యక్షుడు కమ్మా సాంబశివరావు, కొరివి సుబ్బారావు, షేక్ నాగరాజు, వై.భాస్కరరావు, వీరేంద్ర, శ్రీకాంత్, మిల్లు శ్రీను, షేక్ మహబూబ్ సుభాని, గంగాధర్, అన్నారం సర్పంచ్ జొన్న లగడ్డ దానమ్మ, ఉప సర్పంచ్ కొమ్మాలపాటి లక్ష్మీ నారాయణ, అన్నారం ఎంపీటీసీ జంగా సుధీర్, అల్లడి వెంకటేశ్వర్లు, గేరా గణేష్, కొత్త శ్రీనివాసరావు, తాళ్లూరి పెద్దన్న షేక్ నబీషా, ఆయా గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్నతోనే మాదిగల సంక్షేమం

మాదిగ మహా సేన అధ్యక్షుడు కొరిటపాటి ప్రేమ్‌కుమార్



కర పత్రాలు పంపిణీ చేస్తున్న ప్రేమ్‌కుమార్ తదితరులు

గుంటూరు రూరల్: జగనన్నతోనే మాదిగల అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని మాదిగ మహా సేన అధ్యక్షుడు కరిటపాటి ప్రేమ్‌కుమార్ తెలిపారు. ఆదివారం వట్టిచెరుకూరు మండలం అనంతరవప్పాడులో మాదిగ మహా సేన వైఎస్సార్ సీపీకి మద్దతుగా రాష్ట్ర వ్యాప్త పర్యటనలో భాగంగా ప్రచారం, సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు మాదిగ మహా సేనకు సంఘీభావం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మాదిగలంతా వైఎస్సార్ సీపీకి ఓటు వేయాలని కరపత్రాలను ఇంటింటికి పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాదిగలకు అందించిన సంక్షేమ పథకాల కర పత్రాలను అందించారు. ప్రతి మాదిగ పల్లెలో జగనన్న చేసిన మేలును తెలిపారు. మరలా మాదిగలకు మేలు జరగాలంటే జగనన్నను సీఎంగా గెలిపించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాదిగ మహా సేన గుంటూరు జిల్లా అధ్యక్షుడు కూచిపూడి గోపి, ప్రత్తిపాడు అధ్యక్షుడు ఈపూరి తిరుపతిరావు, రాష్ట్ర అధికార ప్రతినిధి సుబ్బారావు, వేజండ్ల ఎర్రయ్య, మున్నంగి వసంతరావు, రూరల్ అధ్యక్షుడు చిలక రమేష్, ఎడ్లపల్లి శివయ్య, పవన్, కీర్తిరాజు, విక్టర్, వెంకట్, లింగం గుంట్ల వెంకట్ పాల్గొన్నారు.

జగనన్న సభ విజయవంతం కావాలి



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాల్గొననున్న బహిరంగ సభ విజయవంతం కావాలని కోరుతూ చింతలపూడి గ్రామం చర్చిలో వైఎస్ఆర్ సీపీ పొన్నూరు అభ్యర్థి అంబటి మురళీ కృష్ణ సోదరి హరి సుందరి ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. -పొన్నూరు



ప్రతి ఇంటికి ప్రచారం

వైఎస్సార్ సీపీ పొన్నూరు అభ్యర్థి అంబటి మురళీకృష్ణ సోదరి తీగల వాణిశ్రీ పట్టణంలోని 8, 9 వార్డులలో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఐదేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. ప్రతి ఇంటికి వెళ్లి కర పత్రాలను అందజేశారు. రానున్న ఎన్నికలలో ఫ్యాను గుర్తుకు ఓటేసి గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. -పొన్నూరు

వైఎస్సార్ సీపీలో గౌడ కుటుంబాల చేరిక



మండలంలోని మునిపల్లె గ్రామంలో గౌడ సామాజిక వర్గానికి చెందిన 50 కుటుంబాల సభ్యులు పొన్నూరు వైఎస్సార్ సీపీ అభ్యర్థి అంబటి మురళీకృష్ణ సమక్షంలో ఆదివారం పార్టీలో చేరారు. గ్రామ సర్పంచ్ కూచిపూడి స్వరూపరాణి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వారికి పార్టీ కండువాలు కప్పి, సాదరంగా అంబటి ఆహ్వానించారు. -పొన్నూరు

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



తెనాలి: పట్టణానికి చెందిన ప్రముఖ స్వచ్ఛంద సంస్థ డి3 శారద సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో బుర్రిపాలెంరోడ్డులోని డాక్టర్ ఎస్ ఎన్‌క్లేవ్ భవనం ఆవరణలో ప్రతినెల చివరి ఆదివారం నిర్వహించే ఉచిత వైద్యశిబిరం కొనసాగించారు. పేర్లు నమోదు చేసుకున్న 300 మందికి సొసైటీ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ డి.శారద ఉచితంగా బీపీ, షుగరు, ఫిజియో థెరపీ పరీక్షలు చేశారు. ఈసీజీ తీశారు. అవసరమైన వారికి నెలకు సరిపడ బీపీ, కాల్షియం, విటమిన్ మందులు ఉచితంగా అందజేశారు. శిబిరానికి హాజరైన అందరికీ అల్పాహారం సమకూర్చారు. పావులూరి ట్రస్ట్ చైర్మన్ పావులూరి శ్రీనివాసరావు, పావులూరి భానుమూర్తి, శ్రీశైల భక్త సేవాసమితి సభ్యులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



నృత్య ప్రదర్శన

నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలోని అన్నమయ్య కళా వేదికపై శ్రీ సాయి మంజీర కూచిపూడి ఆర్ట్ అకాడమీ నిర్వహిస్తున్న అంతర్జాతీయ నృత్య దినోత్సవం(మహా మంజీరనాదం-2024) ఆదివారం ఆరో రోజుకి చేరాయి. ప్రముఖ గాయని పత్రి నిర్మలమదన్ జ్యోతిప్రజ్వలన చేయగా, సభకు డాక్టర్ భూసురపల్లి వేంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. అనంతరం మొహిముద్దీన్‌ఖాన్ (ప్రొద్దుటూరు) నృత్య ప్రదర్శన, అభిశ్రీ మోల్ (తిరువనంతపురం) మోహినీ ఆట్టం, రుత్విక నలమలవు(కర్ణాటక) కూచిపూడి నాట్యం, కె.హరిప్రసాదరావు(తిరుపతి) భరతనాట్యం ప్రదర్శించారు. వారి నృత్యాలు సభికులు, ప్రేక్షకులను అలరించాయి. మొహిముద్దీన్‌ఖాన్‌కు నృత్య శిరోమణి పురస్కారం, కొందరికి యువ కళారత్న పురస్కారాలు, ఎస్వీ సంగీత నృత్య కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ ఎస్.జమునా రాణికి 'మరంగంటి కాంచనమాల' జీవిత సాఫల్య పురస్కారం, ప్రపంచ ప్రఖ్యాత నాట్యాచార్యుడు డాక్టర్ ఎస్.కృష్ణకుమార్‌ను పసుమర్తి కృష్ణమూర్తి జీవిత సాఫల్య పురస్కారంతో ఘనంగా సత్కరించారు. సభలో ప్రముఖ వైద్యులు, రచయిత్రి భార్గవి, వ్యవస్థాపక కార్యదర్శి డాక్టర్ కాజ వెంకట సుబ్రహ్మణ్యం, సంస్థ కార్యదర్శి వెంకటగిరి నాగలక్ష్మి, బిక్కి అలేఖ్య పాల్గొన్నారు.

రూ.1.20 లక్షల నగదు స్వాధీనం

తాడికొండ: ఎలాంటి రసీదులు లేకుండా ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్న రూ.1.20 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు తాడికొండ సీఐ సీహెచ్ ప్రభాకర్ ఆదివారం తెలిపారు. వివరాల ప్రకారం తాడికొండ మండలం కంతేరు శ్రీ సిటీ సమీపంలో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం తనిఖీలు నిర్వహిస్తుండగా పెదకాకాని మండలం కొప్పురావూరు గ్రామానికి చెందిన వరగాని భాను చందర్ అనే వ్యక్తి తన ద్విచక్ర వాహనంపై రూ.1.20 లక్షల నగదు పెట్టుకొని వెళ్తుండగా తనిఖీలు నిర్వహించారు. నగదుకు సంబంధించి ఎలాంటి రసీదులు లేని కారణంగా తాడికొండ పోలీస్ స్టేషన్‌లో అప్పగించి, ఐటీ అధికారులకు పంపించినట్లు సీఐ తెలిపారు.

వైఎస్సార్ సీపీతోనే ముస్లిం మైనార్టీల అభ్యున్నతి

తాడేపల్లిరూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీతోనే ముస్లిం మైనార్టీల అభ్యున్నతి అని ఆ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని అన్నారు. ఆదివారం దుగ్గిరాల ముర్తుజా నగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముస్లిం రిజర్వేషన్లపై బీజేపీ విషం చిమ్ముతోందని, తాము అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు తొలగిస్తామని ప్రధాన నేతలే ప్రకటించడం మైనార్టీలను ఆందోళనకు గురిచేస్తోందన్నారు. ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేస్తామని బహిరంగంగా ప్రకటిస్తున్న బీజేపీతో లౌకిక పార్టీలుగా చెప్పుకుంటున్న టీడీపీ, జనసేన జతకట్టడం ఎంతవరకు సమంజసమన్నారు. ముస్లిం సమాజం కూటమికి గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉందన్నారు.

వివాహ పరిచయ వేదికకు స్పందన

తెనాలిఅర్బన్: ది పద్మశాలీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ముత్తెంశెట్టిపాలెంలోని కల్యాణ మండపంలో ఆదివారం వివాహ పరిచయ వేదికను నిర్వహించారు. పెద్ద సంఖ్యలో పద్మశాలీయ యువతీ, యువకులు హాజరయ్యారు. పరిచయ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు జొన్నాదుల నరసింహారావు మాట్లాడుతూ పద్మశాలీ వెల్ఫేర్ సొసైటీ ద్వారా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సుమారు 246 మంది యువతీ యువకులు హాజరయ్యారని చెప్పారు. అనంతరం వధూవరుల వివరాలు తెలియజేసే పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ కె.రామ్‌చంద్, సంస్థ ప్రతినిధులు జొన్నాదుల మహేష్, అక్కల శ్రీరామ్, దివి పురుషోత్తం, గంజి ప్రభాకర్, శేషగిరిరావు, ఓంకార ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

తెనాలి: పట్టణ సుల్తానాబాద్‌లోని సరస్వతి శిశుమందిర్ విద్యార్థులకు శనివారం రాత్రి గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. కొత్తపేటలోని తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో జరిగిన వేడుకకు శిశుమందిర్ సంచాలిత సమితి అధ్యక్షుడు డాక్టర్ సామల లక్ష్మణబాబు అధ్యక్షత వహించారు. గౌరవ అధ్యక్షుడు కొత్త సుబ్రహ్మణ్యం ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ప్రముఖ వైద్యుడు డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి, విద్యాపీఠం విజయవాడ సమితి కార్యదర్శి కొసనం జగదీష్ సందేశాన్ని వినిపించారు. పాఠశాల కరస్పాండెంట్ కోడూరు రమాదేవి స్వాగతం పలికారు. విద్యాకమిటీ అధ్యక్షుడు యర్రంశెట్టి హనుమంతరావు పర్యవేక్షించారు. విద్యాకమిటీ కార్యదర్శి దూళ్ల నరసింహారావు, కమిటీ సభ్యులు యక్కల శ్రీమన్నారాయణ, పాత్తూరు నాగేంద్రం, అవ్వారు లత, కొత్త దీప్తి, కాజా శివప్రసాద్ పాల్గొన్నారు. కార్యక్రమానికి ముందు విద్యార్థులు సాంస్కృతిక అంశాలను ప్రదర్శించారు.

భావ వ్యక్తీకరణకు భాష కీలకం

తెనాలి: అక్షరం భాషకు ప్రాణం పోస్తుందని, అలాంటి భాషను అచ్చుయంత్రం అజరామరం చేసిందని దళిత సార్వత్రిక విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి అన్నారు. స్థానిక కవిరాజ పార్కులోని వీజీకే భవన్లో ఆదివారం రాత్రి సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటైన సమావేశానికి అధ్యక్షుడు మొవ్వా సత్యనారాయణ అధ్యక్షత వహించారు. 'మానవ వికాసంలో ముద్రణా వికాసం' అనే అంశంపై ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి ప్రత్యేక ప్రసంగం చేశారు. మానవ వికాసంలో భాష ప్రాధాన్యత, అందుకు తోడ్పడిన ముద్రణా పరిణామాన్ని సోదాహరణంగా వివరించారు. అనంతరం అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆయన్ను ఘనంగా సత్కరించారు. అసోసియేషన్ కార్యదర్శి ప్రసాదం పూర్ణచంద్రరావు, చలమయ్య, వాకా పేరిరెడ్డి, అజ్గర్‌అలీ పాల్గొన్నారు.